# తల్లి

ఆవిడ ఎంతందంగా వుంటుందో ఆవిడ పేరుమాత్రం అంతందంగా వుండదు. ఆవిడ పేరు అప్పలనరసమ్మ. ఆవిడా, నేనూ విజయనగరం మహారాజా కాలేజీలో కలిసే చదువుకున్నాం. క్లాసులో ఎప్పుడైనా నాకేసి చూసినప్పుడు ఆవిడ కళ్ళల్లో చల్లదనం కనిపించేది. అప్యాయంగా అకయ్యా అని పిలవాలనిపించేది. కారణం నాకు అక్కయ్య లేకపోవడమే నాకు స్వయానా అన్నయ్యకూడా లేడు. బాబాయి కొడుకు ఒకన్నయ్య వున్నాడు. చిన్నప్పుడు వాడూ నేనూకలిసి హైస్కూలులో చదువుకున్నాం ఇదంతా ఇప్పుడెందుకు చెప్పవలసివచ్చిందంటే ఇవాళ వాడినుంచి ఉత్తరంవచ్చింది.చాలాకాలానికొచ్చిన ఆ ఉత్తరంలో ఆశ్చర్యకరమైన సంగతుంది.

చి॥ సత్యాన్ని దీవించి వ్రాసేది॥——

మొన్న మంగళవారం విజయినగరం వచ్చాను. నీకు ఉత్తరం రాసే వ్యవధి కూడా లేకపోయింది. ఎందుకొచ్చాననుకున్నావు? నీకు కాబోయే వదినను చూసేం దుకు. అల్లాంటి అమ్మాయిని నేనింతవరకూ చూడలేదు. నువ్వూ చూసి ఉండవు. పిడికెడంటే పిడికెడు నడుం. సంపెంగ పువ్వులాంటి శరీరఛాయ. కాలేజీలోకూడా చదువుకున్నదట. పేరు అప్పలనరసమ్మ. ఛ ఛ కాదు అప్సరస. ఇంటికిరాగానే టెలిగ్రాం ద్వారా అంగీకారం తెలియజేద్దామనుకుంటే మానాన్న ఉత్తరం రాశాడు.

వచ్చే నెలలో మంచిరోజున ప్రధానం జరుగుతుంది. అప్పుడు మళ్ళా విజయనగరం వస్తాను. ముందుగా ఉత్తరంరాస్తాను. వీలైతే ఒకటి రెండు రోజులు సెలవుపెట్టి విజయనగరం రా—— విశేషాలు స్వయంగా మాట్లాడుకుందాం.

——అన్నయ్య, పరమేశ్వరరావు

యిల్లా జరుగుతుందని సరదాక్కూడా అనుకోలేదు. ఆవిడమా వదిన!—

ఒక క్షణం యిదంతా నిజమేనా అనిపించింది. వుత్తరం మళ్ళా చదువుకుని జాగ్రత్తగా మడిచి జేబులో పెట్టుకున్నాడు. ఒక నెల రోజుల్లో మళ్లా ఉత్తరం వచ్చింది. చాలా క్లుప్తంగా వుంది. తను రావడం లేదట. ప్రధానానికి మా బాబాయీ మరికొందరు పెద్దలూ వస్తున్నారట. ఇదినాకూ ఒకందుకు మంచిదే అయింది. వాడే కనుక నిజంగా వచ్చి ఉంటే నేను తప్పకుండా వెళ్ళవలసివచ్చేది. మా ఆఫీసులో వచ్చేవారం ఇన్స్పెక్షను. అందుచేత సెలవు దొరకదు.

మళ్ళా పది రోజులనాటి ఆ శుభకార్యంకూడా జరిగినట్లు ఉత్తరం వచ్చింది. యిప్పుడు నిజం కాదని యెలా భ్రమపడటం?

ఆవిడకు మా అన్నయ్య తగినవాడా కాదా అనే ఆలోచన పుట్టింది. వాడు కొంచెం మోటు మనిషే. ఆరడుగుల విగ్రహం. పొడవుకు తగిన లావు. ఆటలాడి కాయదేరిన శరీరం. వాడిముందు ఆవిడ పిట్టలా ఉండవచ్చు. ఇదంతా ఊహించు కుంటే చాలాఆనందంగావుంది. కాలేజీలో ఆవిడ తీయించుకున్న గ్రూప్ ఫోటో ఒకటి వుంది. గోడకి పటాలు తగిలించే అలవాటు లేని నేను ఆ ఫోటో ఫ్రేము కట్టించకుండా పెట్టిఅడుగున వుంచాను. ఒకసారి చూడాలనిపించి కష్టపడి బయటకి తీశాను. ఆవిడ గొప్పగా నవ్వుతో కూచుంది.

ఆరునెలల తరువాత ఆమెని పెళ్ళికూతురుగా చూశాను. పొడవుగా మంగళ కరంగా కుంకుమబొట్టు, బుగ్గపై చుక్క. చల్లని కళ్ళనిండుకూ కాటుకా....మల్లె పూలతో కుట్టిన జడ—సిగ్గుతో పూలుపూస్తున్నదా అనిపించేట్టు వున్నారావిడ....

ఆమెను....అట్లా చూడ కలుగుతానని నేను తమపొక్కుడా వుహించలేదు.

అన్నయ్య ఆమె మెడలో తాళి కడుతున్నప్పటి ఫోటో అబ్బా—నాకు యేదోలావుంది....

మొదటిసారి నేను వొదినా అని పిలిచేటప్పటికి అన్నయ్య పక్కన తల వొంచుకొని నుంచున్నదావిడ—చాలాసేపటికి తలపైకెత్తి చూసింది-

అదే చూపు- ఆర్ద్రత—నిండిన చూపు

మాటాడలేదు....

నేడు సమర్పించబోయే కానుక బంగారు కుంకుమబరిణె.

"యేమిస్తే బావుంటుందో నాకు బొత్తిగా తెలియదు-చివరకా కుంకుమ బరిణె ఆని ఆగిపోయాను....ఆమె చూపులు ఒక్కసారి బరిణెను తాకినాయి.

"ఎందుకురా యివన్నీ అన్నాడన్నయ్య...

నేనేం మాటాడలేదు ...ఒకనిమిషం ఆగి బరిణె ఆమెముందుకు అందించాను అన్నయ్య "తీసుకో" అన్నాడు. ఆమె సంకోచాన్ని చూపుతూ నెమ్మదిగా వేళ్ళు చాచి అందుకున్నది.

ఆమె అన్నయ్యతో గుంటూరు వెళ్ళిపోయింది.

ఆ తరువాత రెండు నెలలకు గావును వినాయకచవితి వొచ్చింది. చవితి ముందురోజు ఆదివారం. ఆ ముందురోజే సెనల్టిమేట్ సాటర్ డే కావడం-నిజంగా అదృష్టం. నేను మంగళవారం కూడా కష్టపడి సెలవు సంపాయించాను.

రోజంతా ప్రయాణం చేసి గుంటూరు చేరాను. బ్రాడీపేటలో అన్నయ్య గారి యింటికి వెళ్ళేటప్పటికి రాత్రి ఏడున్నరయ్యింది. అన్నయ్య భోజనం చేస్తు న్నాడు. ఆమె దగ్గర కూచుని వడ్డిస్తున్నారు.

చేతిలో కేమెరా వుంటే తీయవలసిన దృశ్యం.

అన్నయ్య భోజనంచేసి లేచి—

"యేవిటోయ్ ఇట్లా ఉత్తరంముక్కైనా రాయకుండా దిగబడ్డావే-నువ్వేజన్మ లోనో హిచ్‌కాక్ లాటి వాడివిరా" అన్నాడు. హిచ్‌కాక్ హాలీవుడ్ సస్పెన్స్‌కింగ్

అనుకోకుండా వీలు చిక్కడం మూలాన ఉత్తరం రాయలేకపోయానని అన్నయ్యతో చెప్పాను.

ఎయిర్‌బేగ్ తెరిచి పేకెట్లు బయటపెట్టాను....అన్నయ్యకొక జత బట్టలూ-ఒదినగారికి చీర—లేత నీలిరంగుచీరా-జాకెట్టు గుడ్డా-మిఠాయి పొట్లం-పువ్వులూ-

ఇవన్నీ చూసి నీకీమధ్య డబ్బు ఎక్కువయిపోతున్నట్టున్నదేరా-లేక మతి గాని పోతున్నాదా-" అన్నడన్నయ్య.

లేత నీలిరంగుచీర ఆమెలో గొప్పతృప్తిని నింపినట్టుచూపులే చెబుతున్నాయ్

"స్నానం చేస్తారా" అన్నది ఒదిన.

స్నానం చేసొచ్చి సోఫాలో ఫేన్ కింద కూచున్నాను. ప్రాణం కాస్త కుదుటపడింది ప్రయాణపు బడలిక--

"లేవండి భోజనం చేద్దురుగాని" అన్న ఒదిన పిలుపు- వెళ్ళరా' భోజనం చేసిరా మాటాడుకుందాం" అనే అన్నయ్య కంఠం యించుమించు ఒకేసారి వినిపించాయి.

ఒదిన నెయ్యి ఒడ్డిస్తుంటే.... ...

"మీరు భోంచేశారా ఒదినా" అనడిగాను. లేదన్నట్టు తలూపారు ..

"యేమిటి తొమ్మిదింపావవుతుంది.... యింకా భోంచెయ్యలేదు—అన్నయ్యతో పాటే కూచోవలసింది" అన్నాను.

ఆవిడ సిగ్గుపడుతూ పరవాలేదండి.

"కొంచెం అన్నం వేసుకుంటారా"

ఆవిడ నన్ను మీరు అనడం నాకు పెద్దయిబ్బందిగావుంది. ఆవిడ నాకంటే ఏడు నెలల పదమూడురోజులు పెద్ద

'ఏమీ అననంటే చిన్నకోరిక కోరతాను—నన్ను "మీరు" అవొద్దు-నువ్వు అనండి. మీరు అంటూవుంటే నా కదోలావుంది"—

"అలవాటులేదు యిప్పుడేం పోయింది"

"ప్రయత్నించండి నువ్వు అంటే సంతోషిస్తాను- నన్ను మీరు..'నువ్వు' అంటే సంతోషిస్తాను—మీరు అంటే దూరంగా వుంచినట్టు బాధపడతాను."

ఆవిడ మనస్సు చివుక్కుమన్నట్టు చూసింది....

"మీకు కష్టం కలిగిస్తున్నట్టున్నాను"

"లేదు"

రెండు రోజులు ఆనందంగా గడిచినాయి-చవితిరోజున వదిన నేను తెచ్చిన చీర కట్టుకున్నది. ఈ రెండు రోజుల్లోనూ నన్ను రెండు మూడుసార్లు మాత్రం నువ్వు అన్నది.

"ఉత్తరం రాస్తారా వదినా" అన్నాను

"యేం రాయమన్నారు చెప్పండి"

అదిగో అన్నాను.

ఆమె చక్కగా నవ్వింది—

"నువ్వంటే నీ సొమ్మేంపోయిందె" అన్నాడన్నయ్య.

వెళ్ళిపోతానని చెప్పినప్పుడు----

'రేపుకూడా ఉండకూడదూ-'అన్నదివదిన. నా పరిస్థితిమీద నాకే జాలేసింది

"నువ్వనే పిలుస్తాను పోనీ" అన్నది మళ్ళా. అన్నయ్య నవ్వాడు.

"అంతమాత్రం సెలవుల్లేమిరా" అన్నాడన్నయ్య.

చివరికి వొదినా, అన్నయ్యా ఆ మర్నాడుకూడా నన్ను వుంచేశారు. వొదిన కాస్త చనువుగా మాట్లాడింది ఆ రోజంతా—

తరువాత సంవత్సరంపైగా వాళ్ళని చూడలేదు-నేను రాసిన డజను ఉత్తరాలకి-అన్నయ్యనించి వోరెండూ, వదిన నించి ఓ రెండూ వుత్తరాలు వొచ్చాయి. అన్నయ్యనించి వొచ్చిన మూడో ఉత్తరంలో ఒక విశేషం-వొదినికి మూడోనెలట

ఏడు నెలలు తరువాత మళ్ళీ ఉత్తరం. వొదినా, మూడురోజుల పాపాయీ క్షేమంగా వున్నట్టు. నా మనసులో గొప్ప నిండుదనం అవహించింది....వొదిన తల్లి వొదిన యిప్పుడు తల్లి....

మరింకో వారానికి మళ్ళా వుత్తరం-యిరవై వొకటో రోజున వుయ్యాల్లో వేసేనాటికి తప్పకుండా రావలిసిందని. అడుగున వొదిన దస్తూరిలో-

"తప్పకుండా వొస్తావుకదూ-యీ వొదిన కోసం-యీ పాప కోసం రావాలి —నీ వొదిన" అనివున్నది

ఆ అక్షరాలు నన్ను గుంటూరులాక్కెళ్ళినాయి.

నేను యీ సారి వెళ్ళేసరికి రాత్రి ఎనిమిదయ్యింది-కాని యీ సారి చూసిన దృశ్యం వేరు-

వుయ్యాల దగ్గిర అన్నయ్య=వదిన-వదినలో గొప్పమార్పు-మాతృత్వపు నిండుదనం-దివ్యత్వం!

పాపాయిని నా కందిస్తో—
"యెవరి పోలీకో చెప్పు" అన్నది ఒదిన
నాకు హాయనిపించింది—
అన్నయ్య పోలికే అన్నాను.
అన్నయ్య గుడ్లురిమి చూశాడు.
తిన్నగా చూడవోయ్ అన్నాడు.
"నిజమేనూ—నీ పోలికేన్రా" అన్నాను.
"నీ కళ్ళు గుడ్డి-మీ వదిన పోలికల్లేవూ"
వదిన ఆనందంగా నవ్వింది.

ఉదయం పాపాయి వేలికి నీలంపొడి వుంగరం వోటి పెట్టాను. మళ్ళా అన్నయ్యా, వదినా గొడవ-పాపాయి పేరు దగ్గర మళ్ళాగొడవొచ్చింది. ఎప్పటికీ తేలలేదు. చివరికి మూడో నెలలో అన్నవరం వెళ్ళి వ్రతం చేయించి అప్పటికి పేరు పెట్టే షరతుపై ఉభయ పక్షాలకు రాజీ కుదిరింది.

వదిన చేతుల్లో పాపాయితో ఒక ఫోటో తీస్తే బావుణ్ణనిపించింది. కాని ప్రస్తుతం కేమెరా లేదు.

నాకు చాలా ఆనందం వేసి—
"వొదినా మీరు గొప్ప అదృష్టవంతురాలు" అన్నాను.
"యేమిటి అదృష్టం"అన్నది వదిన.వుయ్యాల జంపాల ఊపుతూ. నేనేమీ చెప్పలేక పోయాను.

పాపాయిని చూస్తూ నిండుగా నవ్విందొదిన. ఎట్లా మర్చిపోతాను. ఆ మాతృమూర్తి నవ్వును?

పాపాయి చిన్నగా ఏడవబోతే వెంటనేతీసి గుండెలకదుముకుని,ఆపసికందును ముద్దులతో వుక్కిరి బిక్కిరి చేసింది వదిన.... వ—ది—న!

ఆ పాపాయి తల్లి—
నేను వెళ్ళిపోతాను తెల్లవారిజాము బండికి అని చెప్పినప్పుడు వదిన—
"నువ్వు చిక్కిపోయినావోయ్" అన్నది—
''యింకా పెళ్ళి చేసుకోవూ—మా తోడికోడల్ని చూడాలనివుంది యేమిటట్లా చూస్తావ్''-అన్నది.

నేను గొప్ప ఆనందంతో వుక్కిరిబిక్కిరయిపోయాను. నన్ను అలా గొప్ప వాత్సల్యంతో పిల్చిన వాళ్ళెవరూ లేరు. వొదిన ఒక్కరే-మా ఒదిన-

ఆరు నెలల తరువాత వదిన నుంచి ఉత్తరం. వదిన తనంత తాను ఉత్తరం రాయడం ఇదే మొదటిసారి. బెజవాడలో వాళ్ళ దూరపుబంధువులెవరో ఉన్నారట వాళ్ళకో అమ్మాయి ఉన్నదట-పేరు రాజేశ్వరి-నేను వెళ్ళి చూడాలట-ఇదీ— ఉత్తరంలో విషయం-

యీ వుత్తరం అందిన వెంటనే వారానికి నాన్నగారినుంచి మరో ఉత్తరం అదే విషయాన్ని గురించి-నన్ను బెజవాడ వెళ్ళమని-బాబాయి ఒక నెల నుంచి. బెజవాడలో వుంటున్నాడు కనుక గొడవలేదు.

వదినకు వుత్తరం రాశాను.

"మీ సలహాపై బెజవాడ వొస్తున్నాను. గుంటూరుకూడా వస్తున్నానని చెప్పడానికి ఆనందంగా వుంది. ఈ సారి కేమెరా తెస్తాను. పాపనీ, మిమ్మల్నీ కలిపి ఫోటో తియ్యాలి-ఇంతకీ పాపకేంపేరు పెట్టారో రాశారుకాదు. అన్నయ్యేమంటున్నాడు? తన పోలికని ఒప్పుకోవడంలేదూ. నేనొచ్చి మళ్లా నచ్చచెపుతాలెండి."

నేను బెజవాడ వెళ్ళి బాబాయిని కలుసుకున్నాను-ఇద్దరం పెళ్లిచూపులకని వెళ్లాం. ఆ అమ్మాయి సన్నగా నాజూగ్గావుంది. బాగాపాడింది. బాబాయితో నచ్చినట్టే చెప్పాను. అవతలనుంచికూడా అటువంటి సమాధానమే వొచ్చింది.

కేమెరా, పాపాయికి కొత్తగౌను-గాజుల జతతో-గుంటూరు బండెక్కాను.

నేను వెళ్ళేసరికి వదిన ఒక్కతే సోఫాలో కూచుని వుంది-నన్ను చూసి లేని నవ్వు తెచ్చుకున్నట్టు గ్రహించాను, కారణం ఊహించలేదు.

"మీరు చెప్పిన రాజేశ్వరిని చూశానండీ, మీక్కూడా చూపిస్తాను. అన్నట్టు చూశారా ఇదిగో కేమెరా-ఇదిగో పాపకు గౌను-యివి గా జు లు బాగున్నాయా చెప్పండి-గాజుల సెలక్షను బొత్తిగా తెలియదు నాకు-"

సంతోషంలో ఏదో మాట్లాడేస్తున్నాను.

ఆమె ఒక్కసారి చేతులతో మొహంకప్పుకొని వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది. అంతే-నిలువునా నీరు కారిపోయాను.

"వ ది నా" అన్నాను. ఒక్కొక్కక్షరమే ఒత్తిపలుకుతూ. లోపలనుంచి అన్నయ్య వచ్చాడు. మొహంలో గంభీరత.

"ఎప్పుడొచ్చావురా" అన్నాడు.

"యిదే రావడం అన్నాను"

"నువ్వు బెజవాడొచ్చిన పనేమయింది"

"ఏముంది-బాగానేవుంది-కుదిరినట్టే"

"పెద్దనాన్నకి వుత్తరం రాశావా"

"యింకాలేదు"

కాసేపు నిశ్శబ్దం-వదిన మొహంపైకెత్తలేదు. నాకు గుండె తరుక్కుపోతుంది.

"వదినెందు కేడుస్తుంది" అన్నాను.

"మరేం చెయ్యమన్నావు"

అన్నయ్య చూపుల్లో బాధ. ఏం జరిగిడింది?

"నువ్వు తెచ్చిన గౌను నాలుగురోజులు ముందు తెచ్చివుంటే కలిపి తగలపెట్టేవాణ్ణి"

అంతే—!

కొయ్యబారిపోయాను. చేతినుంచి కేమెరా జారిపోయింది. పాప....పాపలేదు యిక లేనేలేదా! అయితే ఇప్పుడు వదిన తల్లికాదు అకునున్నాను నాలో నేను.

వదిన తలెత్తిచూసింది. కన్నీళ్ళలోంచి.గబగబా లోపలికెళ్లి పాప వుయ్యాల దగ్గరున్న స్టూలుమీద కూర్చున్నది.

వదిన చాలా దారుణంగా ఏడుస్తున్నది.

దగ్గరలో అద్దం—అక్కడ బల్లమీద నేను పెళ్ళిలో చదివించిన కుంకుమ బరిణె-ఆ పక్కన ఆ పక్కన....నేనిచ్చిన ఆ వుంగరం-చిన్న నీలంపొడి వుంగరం

ఆవిడ ఎంత అందంగా వుంటుందో ఆవిడిపేరు అంత అందంగా వుండదు ఆవిడా నేను విజయనగరం మహారాజావారి కళాశాలలో కలిసే చదువుకున్నాం ఆవిడపేరు అప్పలనరసమ్మ.

ఆవిడ ఇప్పుడు పాపలేని తల్లి.

రచన : 1964. ఆంధ్రజ్యోతి వారపత్రిక, 20-3-70